
# రామాయణం తిరగబడింది!



'ఆంధ్రప్రభ' వారపత్రిక . . . 19 ఏప్రిల్, 1999

కారు ఘాట్‌రోడ్డు మీద వింటిని వదిలిన బాణంలాగా రివ్వున జోరుగా సాగిపోతోంది!

ఒకప్రక్క అగాధమైన లోయ, మరోప్రక్క ఆకాశాన్ని అంటుతున్నట్లున్న కొండ- దానిపైన పెరిగిన చెట్లు... దృశ్యం ఎంతో మనోజ్ఞంగా ఉంది.

అది అక్టోబర్ నెలేమో... వర్షాలకు చెట్లు బాగా ఆకులు వేసి ఎటు చూసినా పచ్చదనం, దానిమధ్య రకరకాల రంగుల పూలు, అందమైన డిజైన్‌లు గల పచ్చని స్క్రీన్‌ని కొండకి కట్టినట్లుంది. మధ్యమధ్య సన్నని, తెల్లని పాలధారలుగా జారిపడుతున్న జలపాతాలు ఆ స్క్రీన్‌లను విడదీస్తూ అనేక స్క్రీన్‌లను ఒకదాని ప్రక్కన ఒకటి వేలాడదీస్తున్నట్లున్న దృశ్యాన్ని కల్పిస్తున్నాయి. ఎటు చూసినా ప్రకృతి కాంత సోయగాలతో వయ్యారంగా విహరిస్తున్నట్లుంది.

"మధూ! మన పెళ్ళయ్యాక హనీమూన్ కోసం ఎన్నోచోట్లకు వెళ్లాం కానీ, ఈ అరకులోయ అందాలే వేరు! ఇంతటి అందం మరెక్కడా లేదు కదూ!" అంది వసంత మధు గుండెల మీద వాలుతూ.

ఎదురుగా డ్రైవర్ ముందున్న చిన్న అద్దంలో ఈ దృశ్యం కనిపించేసరికి ఇబ్బందిగా ఫీలయ్యాడు మధు. కొంచెం గగుర్పాటుతో ప్రక్కకి జరిగాడు.

అది గమనించి అద్దంవైపు చూసింది వసంత. సిగ్గుతో ఆమె బుగ్గలు ఉబ్బాయి... ఎఱుపెక్కాయి.

డ్రైవర్ వీరాస్వామి కూడా కొత్తదంపతుల ముచ్చట్లు గమనించినట్లున్నాడు- మందహాసం చేస్తున్నట్లు సాగిన అతని బుగ్గలు ఆ విషయాన్ని తెలుపుతున్నాయి.

దాంతో సిగ్గు మరింత ముంచుకువచ్చింది వసంతకి. చక్‌మని ప్రక్కకు జరిగింది.

"నిజమే వసంతా! ఇక్కడి అందమే వేరు. అంతా ప్రత్యేకం!" అని, ఆమె చెవి దగ్గర నెమ్మదిగా "నీలాగే!" అన్నాడు మధు. వసంత బుగ్గలు సిగ్గుతో మరింత ఎఱ్ఱబారాయి.

"పొండి..!" అంది తల దించుకుని.

"నిజం! అందుకే మీవాళ్ళకీ, మావాళ్ళకీ ఇష్టం లేకపోయినా మనస్ఫూర్తిగా ప్రేమించిన నిన్ను ధైర్యంగా పెళ్ళి చేసుకున్నాను. కులాలు వేరైనా, పద్ధతులూ, ఆచారాలు కలవకపోయినా, ఆ ఆలోచనే నాకెప్పుడూ రాలేదు!" అన్నాడు మధు మళ్లీ.

"మీరు చెప్పినవన్నీ నాకూ వర్తిస్తాయి. మీరే గొప్పనుకోనక్కర్లేదు!" అంది వసంత మూతి ముడుచుకుని.

"ఆ మాట నేను కాదన్నానా? అదిసరే కానీ, సీతమ్మవారిలాగా చూలాలిగా ఉన్న నీకు అడవిని చూడాలన్న కోరిక ఎందుకు కలిగింది?"

"అడవిని చూడాలనిపించడం నిజమే కానీ, సీతమ్మ వారితో పోల్చకండి! ఆమె పడ్డ కష్టాలు ఎవరికీ వద్దు... చేయని నేరానికి శిక్ష లనుభవించింది ఆ తల్లి! అదిసరే కానీ, అడవిని చూడాలన్న సీతను రాముడు అడవికి పంపినట్లు మీరూ చేయరుగా?" అంది వసంత నవ్వుతూ.

"ఎంత మాటన్నావు వసంతా! సరదాకి కూడా అలాంటి మాటలనకు! నా ప్రాణం పోయినా నిన్ను ఎన్నటికీ వదలను!"

"అంత మాటనకండి! మీవంటి సంస్కారవంతులు దొరకడం నిజంగా నా అదృష్టం!" అంటూ మధు చేయి నొక్కింది వసంత.

కారు బాగా స్లో అయింది!

'ఏమిటా...' అని చూస్తే- దారికి అడ్డంగా పెద్దపెద్ద కొమ్మలు పడివున్నట్లుగా కనిపిస్తున్నాయి. వాటిని గమనించి కారుని స్లో చేశాడు డ్రైవర్.

"గాలీ, వానా ఏమీ లేదు. మరి, కొమ్మలు ఎలా విరిగిపడ్డాయో!" అన్నాడు వీరాస్వామి. కొమ్మల్ని సమీపించగానే కారు ఆపి, కొమ్మల్ని తొలగించడానికి కిందికి దిగాడు.

ఇంతలో... నలుగురు బలిష్టులైన యువకులు బిలబిల్లాడుతూ పొదల్లోంచి బయటకు వచ్చారు. మరునిమిషంలో కారుని చుట్టుముట్టారు.

ఈ హఠాత్పరిమాణానికి వాళ్ళు కొయ్యబారిపోయారు. వాళ్ళ ప్రైప్రాణాలు పైనే పోయాయి. నాలుక పిడచకట్టుకుపోయింది. నోరెండిపోయి నోట మాట రాలేదు. భయంభయంగా వారి వంక చూస్తూండిపోయారు.

వాళ్ళు నలుగురూ గిరిజనులని తెలుస్తోంది. వాళ్ళ చేతుల్లో కైజారులు ఉన్నాయి. భుజానికి విల్లమ్ములు వేలాడుతున్నాయి. కైజారులను ఝుళిపిస్తూ-

"మీ దగ్గరున్న సొమ్మూ, నగలూ బయటపెట్టండి!" అని గద్దించింది ఒక కంఠం.

ఏం చేయాలని నిర్ణయించుకునే లోపలే ఇద్దరు వచ్చి మధుకీ, వీరాస్వామికీ జేబులు సోదాచేసి ఉన్న డబ్బు ఊడలాక్కున్నారు.

మరొకడు వచ్చి వసంత మెడలో చేయి వేయబోయాడు. వాడికా అవకాశం ఇవ్వకుండానే ఆమె మెడలోని గొలుసూ, చేతిగాజులూ తీసి వాడి చేతిలో పడేసింది.

వాడి దృష్టి మెడలోని మంగళసూత్రం మీద పడటం చూసి, అదికూడా తీయబోతుంటే... నాలుగవ వాడు నాయకుడు కాబోలు-

"అది తీయొద్దురే! ఉంచు!!" అన్నాడు.

అతని సెంటుమెంటుకి కృతజ్ఞతా పూర్వకంగా చూసింది వసంత.

"ఇంక రండిరా!" అన్నాడు ఆ నాయకుడు ముందుకి అడుగు వేస్తూ,

"దొరా! పాలపిట్ట పంచనుంటే పస చూడకుండా వదిలేద్దామా?" అన్నాడు మిగిలిన వారిలో ఒకడు- వసంత వైపు చూస్తూ.

వసంత పైప్రాణాలు పైకే ఎగిరిపోయాయి!

ఆ మాటలు వినగానే వెనుదిరిగి ఆమె వంక చూశాడు నాయకుడు.

దగ్గరకు వచ్చి వసంత చేయి పట్టుకున్నాడు.

షాక్ తిన్నవాడిలా బిత్తరచూపులతో నిల్చుండిపోయాడు మధు.

"ఒరేయ్ఁ...!" అంటూ వాడి మీదకు లంఘించబోయాడు వీరాస్వామి.

అంతే... వెనకాల నుంచి ఒకడు అతని మెడమీద గట్టిదెబ్బ కొట్టాడు. కళ్ళు బైర్లు కమ్మి, స్పృహ తప్పి కుప్పకూలిపోయాడు వీరాస్వామి.

గింజుకుంటున్న వసంతను, మధును కబేళాకి మేకలను లాక్కుపోయినట్లు ఆ అడవిలో చెట్ల వెనక్కి లాక్కెళ్లారు వాళ్ళు. కొంచెందూరంలో మధుని ఒక చెట్టుకు కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కారు. అతని కళ్ళముందే ముందు నాయకుడు, ఆ తర్వాత మిగిలిన ముగ్గురూ వసంతను రాక్షసంగా అనుభవించారు.

ఆవేశం చల్లారాక ఆ నలుగురూ అడవిలోకి చల్లగా జారుకున్నారు.

వసంత లేచి వచ్చి భర్త కట్లు విప్పింది.

అతని ముఖం వంక చూడలేకపోయిందామె. అతనూ చూడలేకపోయాడు. ఇద్దరూ మౌనంగా తప్పు చేసిన వారిలాగా ఎటో చూస్తూ కారు దగ్గరకు వచ్చారు.

అప్పటికి వీరాస్వామికి తెలివి వచ్చి వాళ్ళకోసం ఆందోళనగా ఎదురుచూస్తున్నాడు. వాళ్ళని చూడగానే జరిగిందేమిటో అర్థమైంది. ఏమీ మాట్లాడకుండా కారు తలుపు తీశాడు.

రోడ్డుకి అడ్డంగా ఉన్న కొమ్మల్ని తొలగించి వచ్చి, కారును స్టార్ట్ చేశాడు.

●

ఇంటికి వచ్చాక మధు- వసంతను డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్తానన్నాడు.

అందుకు ఆమె ఒప్పుకోలేదు. స్నానం చేయడానికి బాత్‌రూమ్ వైపు వెళ్లిపోయింది.

పైకి అలా అన్నాడే కానీ, నిజానికి మధుకి కూడా వసంతను డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లడం ఇష్టం లేదు.

ఆరోజు ఇద్దరికీ తిండీతిప్పలు లేవు. కాస్త కాఫీ తాగి పడుకున్నారు. వసంత వేరే మంచంమీద పడుకుంది.

తన మంచం మీదికి రమ్మని మధు పిలవనూ లేదు. మంచాలు కలిసే ఉన్నా, ఇద్దరూ ఎడముఖం, పెడముఖంగానే పడుకున్నారు.

రోజులు గడుస్తున్నాయి!

మధూ, వసంతల మధ్య ఇరుక్కున్న ఇనుప తెర తొలగనే లేదు. అత్యవసరమైన మాటలు తప్ప వేరే మాటలేవీ వారి మధ్యన లేవు. మునుపటి ప్రేమా లేదు, అనురాగమూ లేదు. కలిసి పడుకోవడం అసలే లేదు.

వసంతకి అయిదవ నెల నిండుతోందేమో... పొట్ట పెరుగుతూ రోజురోజుకూ ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. గర్భిణీ స్త్రీలకు కలిగే కోరికలూ, కోరుకునే రుచులూ అన్నింటినీ మనసులోనే దాచుకుంటోంది... పైకి వ్యక్తం చేయటం లేదు.

మధు అడిగిందీ లేదు.

ఇన్నాళ్లూ మధుకి వసంత పట్ల ఉదాసీనతే ఉంటూ వచ్చింది. ఇప్పుడు అసహనం కూడా బాగా పెరిగిపోయింది. చీటికీమాటికీ చికాకుపడటం, ప్రతిదానికీ విసుక్కోవడం ఎక్కువైపోయింది.

'తనని గాఢంగా ప్రేమించి పెళ్ళాడిన మధు ఇతనేనా..?' అని ఆశ్చర్యం కలగసాగింది వసంతకి. ఇంతకీ... తను చేసిన తప్పేమిటి?

వసంతకు నెలలు నిండుతున్నాయి!

మధులో అసహనం పరిపక్వ దశకు చేరుకుంటోంది!

చేయని తప్పుకి శిక్ష అనుభవిస్తూ తాను అక్కడ ఎందుకు ఉండాలో అర్థంకావడం లేదు వసంతకి. కానీ, గత్యంతరం లేదు.

ఆరోజు అర్థంలేని కారణం పట్టుకుని వసంత మీద విరుచుకుపడ్డాడు మధు. చివరకు అనేశాడు– "చూడు, గుండెల మీద కుంపటిని నేను ఇంకెంతమాత్రం భరించలేను! నువ్వు ఇక్కడనుంచి వెళ్లిపో!" అని.

"ఎక్కడికి వెళ్లమంటారు?" వసంత నిర్లిప్తంగా చూస్తూ అడిగింది.

"మీ పుట్టింటికి వెళ్లు!"

"వాళ్ళ ఇష్టానికి విరుద్ధంగా మిమ్మల్ని కట్టుకున్ననాడే వాళ్ళు నాతో తెగతెంపులు చేసుకున్నారు. వాళ్ళతో తగాదా పడి మీకోసం బయటకు వచ్చినదాన్ని- మీకు పనికిరాని దాన్ని వాళ్ళకి ఇష్టమే కాదు. ఇంతకీ... నేను చేసిన తప్పేమిటి?"

"నువ్వేం తప్పు చేయలేదు. నాకు తెలుసు. కానీ, కుక్క ముట్టుకున్న కూడును ఇంట్లో పెట్టుకోలేను."

"కూడును కుక్క ముట్టుకునే అవకాశం కల్పించడం యజమాని తప్పు కాదా?"

"ఏమో... నాకు తెలీదు! వాదన అనవసరం... నేను మాత్రం నిన్ను ఇంట్లో ఉంచుకోలేను!"

"సార్! కారు రెడీ!" అంటూ వచ్చాడు వీరాస్వామి.

"వీరాస్వామీ! అమ్మగారిని తీసుకుని ఆమె ఎక్కడికి వెళ్ళాలంటే అక్కడ దింపేసిరా!" అన్నాడు మధు.

"బాబూ! అంతా వింటూనే ఉన్నాను. ఇన్నాళ్లూ గమనిస్తూనే ఉన్నాను. ఇదే మీ కన్నకూతురికి జరిగితే ఇలా చేస్తారా? ఆనాడు చేయని తప్పుకి శ్రీరాముడు సీతమ్మతల్లిని అడవికి పంపాడు. ఈనాడు తానుగా ఏ తప్పూ చేయని నా తల్లినీ మీరు వదిలేస్తా నంటున్నారు. ఇటువంటి చోట కొలువు నాకొద్దు బాబూ! ఇవిగో కారు కీస్! ఆనాడు వాల్మీకి మహర్షి సీతమ్మను కాపాడాడు. నేను అంతటివాడిని కాకపోయినా ఉన్నంతలో నా తల్లిని పువ్వుల్లో పెట్టి చూసుకుంటాను. ఇంక ఆయమ్మకు నేనే తండ్రిని... ఆయమ్మ నాకు తల్లి! మరో మాట..! అమ్మ కడుపులో పెరుగుతున్న అంకురం మీదని మీకూ తెలుసు. పురుడు వచ్చాక ఆ శిశువుని మీ దగ్గరకు పంపడం కానీ, కనీసం మీకు చూపడం కానీ జరగదు. అసలు బిడ్డ పుట్టిన విషయాన్నే మీకు తెలపడం జరగదు! మీవంటి వారి నీడ కూడా ఆ శిశువు మీద పడకూడదు!" అని వసంత వైపు తిరిగి-

"రా... తల్లీ! మనింటికి పోదాం! ఈ నరరూప రాక్షసుని నీడ కూడా నీకొద్దు!" అంటూ ముందుకు అడుగువేశాడు వీరాస్వామి.

మౌనంగా అతన్ని అనుసరించింది వసంత.

మబ్బులేని పిడుగు నడినెత్తిన పడినట్లయింది మధుకు. వాళ్ళు వెళ్లిపోతుంటే వాళ్ళవంక సూటిగా చూడలేకపోయాడు. ఓరచూపులతో వారిని చూశాడు.

వారు కనుమరుగైనా చాలాసేపు అలానే నిల్చుండిపోయాడు.

●

ఇరవై సంవత్సరాలు గిర్రున తిరిగిపోయాయి!

వసంత కుమార్తె 'విశాల' పోస్టుగ్రాడ్యుయేట్ అయి, ఐ.ఏ.ఎస్. ఆఫీసర్‌గా సెలెక్ట్ అయింది.

మధు సమాజంలో పెద్దమనిషిగా చలామణీ అవుతూనే ఉన్నాడు.

వివాహ మంటపం కళకళలాడుతోంది.

సర్వాలంకార శోభిత అయిన విశాల పెళ్ళిపీటల మీద కామేశ్వరీ దేవిలాగా కూర్చుని ఉంది. పురోహితులు మంత్రాలు చదువుతున్నారు. ప్రవర చెప్పేటప్పుడు వధువు తరపు పురోహితుడు–

"అమ్మా! వధువు తండ్రి పేరు?" అని అడిగాడు.

"వీరాస్వామి!" అన్న సమాధానం వచ్చింది వసంత నోట.

వీరాస్వామికి నెత్తిన పిడుగు పడినట్లయింది. కొయ్యబారిపోయాడు.

పెళ్ళికి వచ్చినవారిలో చాలామంది ముఖాలు ప్రశ్నార్థకాలుగా మారాయి. పెళ్ళిపందిట్లో సందడి బదులు విచిత్రమైన మౌనం చోటుచేసుకుంది.

"కాదు! విశాల తండ్రిని నేను!" అంటూ ముందువరుసలో ఉన్న ఒక నడి వయస్కుడు లేచి నిలబడ్డాడు. నమాజ్ చేసేటప్పుడు అందరి తలలూ మక్కా వైపు తిరిగినట్లుగా అందరి మెడలూ ఆ వ్యక్తి వైపు తిరిగాయి.

అతను ఎవరో కాదు... మధు!

సమాజంలో పేరున్న పెద్దమనిషి!!

వసంత నిబ్బరంగా లేచి నిలబడింది...

"ఓఁ... మధుగారా? విశాల మీ కుమార్తె అన్న విషయం ఈ నిమిషంలో గుర్తుకి వచ్చిందన్నమాట! అవును మరి, 'ఐ.ఏ.ఎస్. ఆఫీసరుకి తండ్రి' అని చెప్పుకోవడం గర్వకారణమేగా! కానీ, మీరు నా కూతురుకి తండ్రి అంటే నేను ఒప్పుకోను!" అంది.

"అమ్మా..!" అన్నాడు వీరాస్వామి మతిపోయి.

"అవును. చేయని తప్పుకు చూలాలైన నన్ను ఇంటినుంచి తరిమివేశాడు ఈ పెద్దమనిషి. ఆ సమయంలో వాల్మీకి మహర్షిలా, కన్నతండ్రిలా ఆదుకుని కంటికి రెప్పలా కాపాడాడు మా డ్రైవర్ వీరాస్వామి! అంతేకాదు, కన్నతండ్రి నెరవేర్చవలసిన బాధ్యత లన్నిటినీ విశాలకి తాను నెరవేర్చాడు. ఈనాటివరకూ మేము ఉన్నామో, పోయామో– చచ్చామో, బతికామో కూడా పట్టలేదు ఈ పెద్దమనిషికి!

తన కూతుర్ని మొదటిసారి చూసింది కూడా ఈనాడే! ఇంతలోనే ఇంత ప్రేమ పుట్టుకువచ్చింది?! పెళ్ళికి వచ్చిన పెద్దలూ... మీరే చెప్పండి- ఏ బాధ్యతా తీసుకోని ఈ పెద్దమనిషా తండ్రి? బాధ్యతలు నెరవేర్చిన వీరాస్వామా? ఎవరు విశాలకు తండ్రి? మీరే చెప్పండి!" అంది వసంత ఆవేశంగా.

"అమ్మా... విశాలా! అమ్మకి నువ్వయినా చెప్పు!" అన్నాడు మధు.

"ఈ క్షణం వరకు మీరెవరో నాకు తెలియదు. మిమ్మల్ని ఇదే చూడటం! మీరే నా తండ్రి అని తెలిసి నన్ను నేనే అసహ్యించుకుంటున్నాను. మీ రక్తం నాలో ఉన్నందున నాపైన నాకే రోత కలుగుతోంది. కానీ, మా అమ్మ ధైర్యం, వీరాస్వామి తాత ఔదార్యంతో నాలో ఉన్న మలిన రక్తం ప్రక్షాళనం అయిపోయింది. మిమ్మల్ని తండ్రిగా గుర్తించి మళ్లీ నా మనసును మలినం చేసుకోలేను. వీరాస్వామి తాత మా అమ్మను కాపాడిన తండ్రి! నన్ను పెంచిన తండ్రి! నాకు కన్నతండ్రి ఎవరూ లేరు!" అంది విశాల ధైర్యంగా.

ఆమెను అభినందిస్తున్నట్లుగా మంగళవాద్యాలు జోరుగా మోగాయి.

ఆ సవ్వడిలో మధు ఎప్పుడు బయటకు జారుకున్నాడో ఎవరూ గమనించలేదు.

పెళ్ళితంతు పూర్తి అయింది!

"దంపతులు పెద్దలకి పాదాభివందనం చేయండి!" అంటూ అక్షింతలు చేతపట్టుకు వచ్చారు పురోహితులు.

"ముందుగా తాతగారి పాదాలకు నమస్కరించమ్మా!" అంది వసంత.

విశాల, ఆ అమ్మాయితో పాటు వరుడు తొలి పాదాభివందనం వీరాస్వామికి చేశారు. వీరాస్వామి కళ్ళు చెమర్చాయి. గొంతు మూగపోయింది. విశాల తలను ప్రేమగా నిమిరాడు.

వసంత ముఖంలో పెళ్ళిపందిట్లోని దీపాలకాంతిని మించిన కాంతి ప్రస్ఫుటంగా చోటుచేసుకుంది.

'ఆంధ్రప్రభ' వారపత్రిక . . . *19 ఏప్రిల్, 1999*